సాక్షి నిజామాబాద్
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



ముక్కుతున్న మక్కలు
నూర్పిళ్లు చేసి ఆరబోసిన మక్కలు వర్షాలకారణంగా ముక్కిపోతున్నాయి. తడిసిన మక్కలు బూజుపట్టి రంగుమారుతున్నాయి.
- 10లో ▸



చేతికందని సాయం
జిల్లాకు చెందిన వందలాది మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.0 /24.6

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీ నీటి విడుదల
- 9గేట్ల ద్వారా 28వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పెరగడంతో 9 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 28 వేల క్యూసెక్కుల నీటిని ప్రాజెక్ట్ అధికారులు విడుదల చేస్తున్నారు. 50వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. వరద కాలువ ద్వారా 12 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5,500, కాకతీయ కాలువ ద్వారా 2 వేలు, లక్ష్మీకాలువ ద్వారా 200, సరస్వతీ కాలువద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కులనీరుపోతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా, శనివారం సాయంత్రానికి అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

జెండా బాలాజీ హుండీ ఆదాయం లెక్కింపు



నిజామాబాద్ సిటీ: నగరంలోని జెండా బాలాజీ ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల, ఆలయ కమిటీ చైర్మన్ జాలిగం గోపాల్, ఈవో వేణు సమక్షంలో హుండీలను తెరిచారు. రూ. 6,31,781 నగదుతోపాటు 17 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 500 గ్రాముల 500 మిల్లీగ్రాముల వెండి వస్తువుల ఆదాయం సమకూరినట్లు ఇన్‌స్పెక్టర్ కమల తెలిపారు. ఆలయ కమిటీ డైరెక్టర్లు సాయిలు, నర్సింగ్‌రావు, అంజనేయులు, నాగాచార్యులు, రఘునాథ్, ప్రశాంత్ భక్తులు పాల్గొన్నారు.

బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన




సుభాష్‌నగర్: నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఈనెల 3న నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య శనివారం సాయంత్రం పరిశీలించారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం, భద్రతా సిబ్బంది సూచనల మేరకు పనులు జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు చేశారు. వారివెంట రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పెద్దోళ్ల గంగారెడ్డి, బీజేవైఎం నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ఎర్రం సుధీర్ తదితరులున్నారు.

ఓటీఎస్ గడువు పొడిగింపు
- వచ్చే ఏడాది జనవరి 31 వరకు అవకాశం
- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



సుభాష్‌నగర్: సొసైటీ చైర్మన్లు, రుణాలు పొందిన రైతుల అభ్యర్థన మేరకు ఏక కాల పరిష్కార పథకం (ఓటీఎస్) గడువు తేదీని వచ్చేఏడాది జనవరి 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఓటీఎస్ గడువు మే 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఉండగా, సెప్టెంబర్ 30 వరకు గడువు తేదీని పొడిగించామని పేర్కొన్నారు. రుణగ్రస్తుల లబ్ధి కోసం మళ్లీ గడువు తేదీని పొడిగిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. మార్చి 31, 2023 వరకు కాల పరిమితి ముగిసి బ్యాంకు బట్వాడా చేసి సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలపై అపరాధ వడ్డీ 100శాతం మాఫీ, వాయిదా మీరిన వడ్డీపైన 30శాతం మాఫీ చేస్తామని తెలిపారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి కాలపరిమితి ముగిసిన ఎస్ఎఫ్ఎస్, మార్టిగేజ్, ఎల్‌టీ రుణాలు, జేఎల్‌జీ, ఎస్‌హెచ్‌జీ రుణాలపై వడ్డీ 32శాతం వడ్డీ చేయనున్నట్లు వివరించారు. మిగతా వివరాల కోసం సొసైటీల్లో, బ్రాంచ్ మేనేజర్లను సంప్రదించాలని భాస్కర్‌రెడ్డి సూచించారు.



జనగర్జనా.. కృతజ్ఞత సభా?

- ఈనెల 3న ప్రధాని మోదీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- పసుపు బోర్డు ప్రకటించే అవకాశం!
- తరలిరానున్న రైతులు..
- కృతజ్ఞత సభగా మార్చనున్నట్లు సమాచారం
- రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ కేంద్రం ఏర్పాటుకు వర్చువల్ విధానంలో ప్రారంభం
- భారీ జనసమీకరణకు బీజేపీ శ్రేణుల కృషి
- పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి తరలింపు

ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అన్ని లోక్‌సభ స్థానాలపై బీజేపీ అధిష్టానం నజర్ పెట్టింది. ఈ నేపథ్యంలో ఇందూరులో జరిగే సభలో ప్రధాని మోదీ కీలక ప్రకటనలు చేయనున్నట్లు సమాచారం. సభలో ప్రస్తావించే పసుపు బోర్డు అంశం వివిధ సమీకరణలను మార్చనుందని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది.



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న వాయుసేన సిబ్బంది, జిల్లా అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికల కోడ్‌కు కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో ఉత్తర తెలంగాణలో కీలకమైన ఇందూరు నుంచి భారతీయ జనతా పార్టీ ఉద్దేశాన్ని చాటేందుకు నేరుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ రంగలోకి దిగుతున్నారు. ఈ నెల 3న నిర్వహించనున్న సభకు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని నిజామాబాద్, జగిత్యాల జిల్లాలతో పాటు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నిర్మల్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డి జిల్లాల శాసనసభ సెగ్మెంట్ల నుంచి భారీ జనసమీకరణకు రాష్ట్ర పార్టీ నాయకత్వం తగిన ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా జిల్లాల, పార్లమెంట్ ఇన్‌చార్జులు, ప్రభారీలు ఎక్కడికక్కడ ఉండి పర్యవేక్షణ చేస్తున్నారు. ఆయా సెగ్మెంట్ల వారీగా ఇన్‌చార్జులు, ప్రభారీలు సభకు ఐదు రోజుల ముందు నుంచే క్షేత్రస్థాయిలో జనసమీకరణ కోసం కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే టిక్కెట్ల ఆశావహులు సైతం జనసమీకరణలో పనిచేస్తున్నారు. ఈ సభ కోసం ఇప్పటికే లక్ష నీళ్ల బాటిళ్లను తెప్పించారు. వర్షం వచ్చినా సభకు అంతరాయం కలుగకుండా జర్మన్ టెంట్లను వేస్తున్నారు. బహిరంగ సభ నిర్వహించనున్న గిరిరాజ్ కళాశాల మైదానాన్ని నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ దళం ఇప్పటికే ఆధీనంలోకి తీసుకుంది. భారత వాయుసేన హెలీకాప్టర్లు నిజామాబాద్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేస్తున్నాయి.

ఇందూరు నుంచి శంఖారావం..

పార్లమెంట్ ఎన్నికలకు కేవలం నాలుగు నెలలు ముందుగా జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ పకడ్బందీగా పావులు కదుపుతోంది. పార్టీకి గట్టి పట్టున్న ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అన్ని లోక్‌సభ స్థానాలపై పార్టీ అధిష్టానం భారీ ఫోకస్ పెట్టింది. వరుసగా జాతీయ నాయకుల సభలు నిర్వహించేందుకు ప్లాన్ చేసింది. ఉత్తర తెలంగాణలో కీలకమైన ఇందూరు నుంచి ప్రధాని శంఖారావం పూరిస్తున్నారు. గత ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటుకు హామీ ఇచ్చిన ధర్మపురి అర్వింద్ ఎంపీగా కేసీఆర్ కుమార్తె కవితపై విజయం సాధించారు. పక్కనే ఉన్న ఆదిలాబాద్, కరీంనగర్ పార్లమెంటు స్థానాలను సైతం బీజేపీ కైవసం చేసుకుంది. ఈ క్రమంలో మళ్లీ విజయం సాధించేందుకు, మరిన్ని స్థానాలపై కన్నేసిన పార్టీ అధిష్టానం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ప్రధాని మోదీతో పసుపు బోర్డును ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ సభకు పసుపు రైతులు భారీగా రానున్నట్లు తెలుస్తోంది. దీంతో 'ఇందూరు జనగర్జన సభను.. పసుపు రైతుల కృతజ్ఞత సభగా మార్చనున్నట్లు తెలుస్తోంది.

రైల్వే, రోడ్డు ప్రాజెక్టుల ప్రకటన!

అధికారిక కార్యక్రమాలతో పాటు రాజకీయ సభ నేపథ్యంలో ప్రధానమంత్రి పలు కీలక ప్రకటనలు ఇందూరు నుంచే చేయనున్నట్లు తెలుస్తోంది. రామగుండంలో ఆల్ట్రా సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన 800 మెగావాట్ల థర్మల్ కేంద్రాన్ని ఇక్కడి నుంచే వర్చువల్ విధానం ద్వారా ప్రధాని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఉత్తర తెలంగాణకు సంబంధించిన పలు రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. పసుపు బోర్డును సైతం ప్రకటించనున్నట్లు సమాచారం. ప్రస్తుత రాజకీయ వేడి వాతావరణంలో పసుపు బోర్డు అంశం వివిధ సమీకరణలను మార్చనుందనే చర్చ వివిధ వర్గాల్లో జరుగుతోంది. ప్రత్యర్థి పార్టీలపై ఏవిధమైన ప్రచార అస్త్రాలను నరేంద్రమోదీ సంధించనున్నారనే విషయమై ఉత్కంఠ నెలకొంది. బీజేపీ శ్రేణుల్లో మాత్రం ఉత్సాహం రెట్టింపైంది.



కలెక్టరేట్‌లో వాయుసేన హెలీకాప్టర్

ప్రధాని సభకు భారీ బందోబస్తు

- వాయుసేన హెలికాప్టర్‌తో ఏరియల్ సర్వే
- జీజీ కాలేజీ గ్రౌండ్‌ను అధీనంలోకి తీసుకున్న ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ
- 2 వేల మంది పోలీసులతో పహారా : సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి : ఈ నెల 3న నిజామాబాద్ జిల్లాకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రానున్న సందర్భంగా పోలీసుల భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. స్థానిక గిరిరాజ్ కళాశాల మైదానంలో జరిగే మోదీ సభ ప్రాంగణాన్ని ఎస్పీజీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ కంట్రోల్‌లోకి తీసుకున్నాయి. ఎస్పీజీ, ఎన్ఎస్‌జీకి చెందిన ఐజీ, డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు 50 మంది వరకు ఇక్కడికి చేరుకొని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శనివారం ఉదయం, మధ్యాహ్నం వాయుసేనకు చెందిన హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక విమానంలో, హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రానికి హెలికాప్టర్‌లో వస్తారని అధికార వర్గాల ద్వారా తెలిసింది. జిల్లా నూతన కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌తో పాటు ఎస్పీజీ, స్థానిక అధికారులతో ట్రయల్ రన్ నిర్వహించారు. ఎస్పీజీ, ఎన్ఎస్‌జీకి దళాలు గిరిరాజ్ కళాశాల మైదానంలో జరిగే సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. సభాప్రాంగణాన్ని ఆధీనంలోకి తీసుకుని అణువణువునా పరిశీలిస్తున్నారు. తెలంగాణ పోలీసు అధికారుల ద్వారా ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ అధికారులు వివరాలను తెలుసుకుంటున్నారు. గ్రౌండ్ బయట జిల్లా పోలీసుల ఆధీనంలో ఉంటుంది. నూతన సమీకృత కలెక్టరేట్ నుంచి సభాప్రాంగణం వరకు 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. మోదీ సభకు ఏడుగురు సీపీలు, 12 మంది అదనపు డీసీపీలు, 37 మంది ఏసీపీలతోపాటు సీఐలు, ఎస్సైలు కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుళ్లలతో కలిసి 2 వేల మంది పాల్గొంటారని సీపీ సత్యనారాయణ తెలిపారు.

నకిలీ ధ్రువీకరణపత్రాలు 19

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో 19 మంది ఉపాధ్యాయులు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తేలింది. నకిలీ వైద్య ధ్రువీకరణ పత్రాల వ్యవహారంపై 'సాక్షి' కథనాలు ప్రచురించడంతో విద్య, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యాధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. బదిలీలు, పదోన్నతుల కోసం మొత్తం 111 మంది ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించారు. వీటిపై ఆరోపణలు రావడంతో జనరల్‌ఆస్పత్రికి రెండుసార్లు పరిశీలన కోసం పంపించారు. సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మూడోసారి సర్టిఫికెట్లను పరిశీలించి.. మొత్తం 111 సర్టిఫికెట్లలో 19 మంది ఉపాధ్యాయులు నకిలీ ధ్రువీకరణపత్రాలు సమర్పించినట్లు గుర్తించారు. గత కొన్నేళ్లుగా విద్యాశాఖ బదిలీలు, పదోన్నతుల వ్యవహారంలో నకిలీ వైద్య ధ్రువీకరణపత్రాల వ్యవహారం కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది జనవరిలో కొందరు టీచర్లు నకిలీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించారని, ఆ నాడు విద్యాశాఖ అధికారులు తూతూమంత్రంగా విచారణ ముగించారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం నకిలీధ్రువీకరణ పత్రాలపై కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఫిర్యాదు చేయడం, 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ సెప్టెంబర్ 19 నుంచి 28వ తేదీ వరకు మూడోసారి వైద్యపరీక్షల కోసం ఉపాధ్యాయులను పిలిపించారు. వారి వాస్తవ ఆరోగ్యస్థితి ఆధారంగా 92 మందికి ధ్రువీకరణపత్రాలు జారీ చేశారు.


నకిలీ ధ్రువపత్రాలు ఆగేనా..!

సాక్షిలో ప్రచురితమైన కథనం

ఫలించని ప్రయత్నాలు
వైద్య ధ్రువీకరణపత్రాల కోసం వెళ్లిన టీచర్లందరికీ సర్టిఫికెట్లు జారీ చేయాలని ప్రధాన సంఘంతోపాటు కొందరు నాయకులు జనరల్ ఆస్పత్రి సూరింటెండెంట్ ప్రతిమరాజ్‌పై ఒత్తిడి తెచ్చారు. ఉన్నతాధికారులతో ఫోన్లుసైతం చేయించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో మరికొన్ని ఉపాధ్యాయ సంఘాలు అర్హులకు మాత్రమే ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆస్పత్రి వైద్యాధికారులకు విన్నవించారు. తమ అనుచరులకు, సంఘం నాయకులకు వైద్య ధ్రువీకరణ పత్రాలను అందించాలని సంఘం నాయకుల చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలపాలి



రాస్తారోకో చేస్తున్న తాటిపల్లి గ్రామస్తులు

సిరికొండ: తమ గ్రామాన్ని రాజన్నసిరిసిల్ల జిల్లాలో కలుపాలని కోరుతూ మండలంలోని తాటిపల్లి గ్రామస్తులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. తమ గ్రామం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి 70 కిలోమీటర్లు, మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉందని, 34 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజన్నసిరిసిల్ల జిల్లాలో కలుపాలని కోరారు. తాము వైద్యంతోపాటు అన్ని పనులకోసం సిరిసిల్లకు వెళ్తామని పేర్కొన్నారు. నిజామాబాద్ నుంచి ఒక్కబస్సూ రాదని, సిరిసిల్ల నుంచే వస్తాయని తెలిపారు. తాము ఎదర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తాటిపల్లిని రాజన్నసిరిసిల్ల జిల్లాలో కలుపాలని ఆర్టీసీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు విజ్ఞప్తి చేశారు.

గర్జించిన లబాన్ లంబాడీలు

కామారెడ్డి టౌన్: లబాన్ లంబాడీలు శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో కదం తొక్కారు. ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ నినదించారు. వివిధ జిల్లాలనుంచి లబాన్ లంబాడీలు శనివారం జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అయితే ర్యాలీకి అనుమతి లేదని పలువురిని అరెస్టు చేసేందుకు పోలీసులు యత్నించగా.. తప్పించుకుని కొత్తబస్టాండ్‌వైపు పరుగులు తీశారు. అక్కడి నుంచి నిజాంసాగర్ చౌరస్తాకు చేరుకుని గంటన్నర పాటు ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఆందోళనకారులు లోపలికి వెళ్లేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టర్ రావాలని, అరెస్ట్ చేసిన తమ నేతలను విడిపించాలని పట్టుబట్టారు. దీంతో పోలీసులు తమ అదుపులో ఉన్న లబానా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. అనంతరం కలెక్టర్‌ను కలవడానికి పోలీసులు 20 మందికి అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం నేతలు బంతిలాల్, బన్సీలాల్ మాట్లాడుతూ 1977 గెజిట్‌లో లంబాడీలుగా గుర్తింపు ఉన్నందున ఎస్టీగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో హామీ ఇచ్చి మోసం చేశాడని, ఇందుకు నిరసనగా వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గంలో 1,116 నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు.



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న లబాన్ లంబాడీలు

రీ డిజైన్‌ను రద్దు చేస్తేనే రండి..
- మంచిప్ప రిజర్వాయర్ నిర్వాసితుల పోస్టర్లు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మంచిప్ప రిజర్వాయర్ రీ డిజైన్ రద్దు చేసిన తరువాతే అధికార పార్టీ నాయకులు ఓట్లు అడిగేందుకు తమ ఇళ్లకు రావాలని మండలంలోని మంచిప్ప గ్రామస్తులు శనివారం పోస్టర్లు అతికించారు. రీ డిజైన్‌లో ముంచే నాయకులు తమకొద్దని మహిళలు పోస్టర్లను ప్రదర్శించారు. 8 ఏళ్లుగా రీ డిజైన్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నామని, అయినప్పటికీ ప్రభుత్వం, ఎమ్మెల్యే బాజిరెడ్డి తమకు న్యాయం చేయలేకపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే బాజిరెడ్డిని ఓడిస్తామని, రీ డిజైన్‌ను రద్దు చేయకుంటే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని నిర్వాసితులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముంపు నిర్వాసితుల కమిటీ ప్రతినిధులు తూర్పు రాజేశ్, మోహన్‌రెడ్డి, సత్యనారాయణ, ముత్యంరెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



తన ఇంటికి పోస్టర్ అతికించిన నిర్వాసితుడు



పోస్టర్లతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఇదేం తిరకాసు

- ఒక్కరు లోన్‌కట్టకపోయినా మిగతా వారు అనర్హులు
- స్త్రీనిధిలో పొంతనలేని నిబంధనలు
- మొండిబకాయిలను రాబట్టలేకపోతున్న అధికారులు



సమావేశమైన ఎస్‌హెచ్‌జీ మహిళలు (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): స్త్రీనిధి.. మహిళల పెన్నిధిగా పేర్కొంటున్న ప్రభుత్వం, కొత్త రుణాలను అందజేసే విషయంలో పొంతన లేని నిబంధనలను పెట్టింది. లోన్ తీసుకున్న మహిళల్లో ఏ ఒక్కరూ వాయిదాలు సక్రమంగా కట్టకపోయినా మిగతా వారు కొత్తగా రుణం పొందే అవకాశం లేకుండా చేసింది. గ్రామంలో బకాయిలు లేకుంటేనే మళ్లీ రుణం ఇస్తామని తిరకాసు పెట్టింది. దీంతో జిల్లాలోని చాలా గ్రామాల్లో మహిళాసంఘాలు స్త్రీనిధి కొత్త రుణాలను పొందలేకపోతున్నాయి. ఫలితంగా నిర్దేశిత రుణపంపిణీని లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. మొండి బకాయిలను రాబట్టే విషయంలో సిబ్బంది సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలు అవసరాల నిమిత్తం స్త్రీనిధి రుణాలు తీసుకుంటున్నారు. గడిచిన రెండున్నరేళ్లలో జిల్లాలో రూ.400 కోట్లకు పైగా స్త్రీనిధి రుణాలను అందజేశారు. చాలామంది వాయిదాల ప్రకారం తిరిగి రుణాన్ని చెల్లిస్తున్నారు. అయితే, కొంతమంది మహిళలు మొండికేసి, మరి కొందరు తప్పించుకుని రుణాలను తిరిగి చెల్లించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 172 మహిళా సంఘాల నుంచి రూ.11.83కోట్లకుపైగా మొండి బకాయిలు వసూలు కావాల్సి ఉంది. పాతవి వసూలు కాకపోగా, కొత్త బకాయిల శాతం పెరుగుతున్నది. అత్యధికంగా సిరికొండలో 22, మెండోరాలో 19 సంఘాల నుంచి రుణాలు రికవరీ కావడం లేదు.

మొండి బకాయిలున్న మండలాలు..

మండలం	సంఘాలు	రెంజల్	13
సిరికొండ	22	వర్ని	11
మెండోరా	19	మోపాల్	09
నవీపేట్	17	బోధన్	08
నందిపేట్	15	బాల్కొండ	08
ఎడపల్లి	15	వేల్పూర్	05

ముందుకు సాగని రుణపంపిణీ
జిల్లాలో ఈ ఏడాది రూ.239కోట్ల స్త్రీనిధి రుణాలను అందజేయడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.50కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. కొత్త రుణం పొందడానికి ప్రభుత్వం పొంతన లేని నిబంధనలు పెట్టడంతో రుణాల పంపిణీ వేగంగా జరగడం లేదు. జిల్లాలో దాదాపు నూటికిపైగా గ్రామాలకు కొత్తగా స్త్రీనిధి రుణాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఒకరిద్దరు లోన్ కట్టకపోతే గ్రామాన్ని మొత్తం పరిగణనలోకి తీసుకోవడం సరికాదని, నిబంధనలను మార్చాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం
స్త్రీనిధిలో కొత్తగా రుణాలు పొందాలంటే వీవోలో బకాయిలు క్లియర్‌గా ఉండాలనే నిబంధన రాష్ట్ర శాఖ నుంచి పెట్టింది. ఈ నిబంధన కారణంగా రుణాలు పూర్తిగా చెల్లించిన వారు మళ్లీ రుణం తీసుకోలేకపోతున్నారనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– చందర్ నాయక్, డీఆర్డీవో

క్లుప్తంగా

క్యాంపస్‌లో ఏబీవీపీ హెల్ప్ డెస్క్



తెయూ(డిచ్‌పల్లి): తెయూలో ఐసెట్, సీపీజీఈటీ నూతన విద్యార్థుల ప్రవేశాల నమోదు ప్రక్రియలో భాగంగా శనివారం క్యాంపస్ ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్ ప్రారంభించారు. కౌన్సెలింగ్ ద్వారా యూనివర్సిటీ ప్రవేశాలు పొందిన నూతన విద్యార్థుల సందేహాలు తీర్చడానికి, వారికి తగిన సహాయ సహకారాలు అందించేందుకు వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. హెల్ప్‌డెస్క్ సేవలు అడ్మిషన్ ప్రక్రియ ముగిసే వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలుంటే 9014748454, 830950484 నంబర్లను సంప్రదించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శివ తెలిపారు.

పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి



తెయూ(డిచ్‌పల్లి): తెయూ సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల పోటీ పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఎన్ఎస్‌యూఐ వర్సిటీ అధ్యక్షుడు కె.శ్రీశైలం డిమాండ్ చేశారు. తెయూ లైబ్రేరియన్ సత్యనారాయణను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సెట్, కాంపిటేటివ్‌కు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సాగర్‌నాయక్, రాజేందర్, రాము, పవన్, సందీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



ఖలీల్‌వాడి: మున్సిపల్ కార్మికులు ఈ నెల 8 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. సమ్మెకు సంబంధించిన నోటీసును మున్సిపల్ మేనేజర్‌కు శనివారం అందజేశారు. సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. ఈ నెల 3న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు చంద్రసింహ, మోహన్, లక్ష్మణ్, సంతోష్ గౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

తప్పలకు బాధ్యులెవరు..?

- పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాం ఎత్తు కుదింపు
- పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు



పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాం ఎత్తును పొక్లెయిన్‌తో తగ్గిస్తున్న సిబ్బంది

మోర్తాడ్(బాల్కొండ): చెక్‌డ్యాం నిర్మాణంలో తలెత్తిన లోపాలను సవరించడానికి చేపట్టిన చర్యలు వివాదాస్పదమయ్యాయి. నిధులు ఎక్కువ మంజూరయ్యేందుకు అవసరం కంటే ఎక్కువ ఎత్తులో నిర్మించడం ఒక ఎత్తయితే.. అసలు ఆ చెక్‌డ్యాంతోనే పంటలు నీట మునుగుతున్నాయని భావించి అనధికారికంగా ఎత్తును కుదించడం గందరగోళానికి తావిస్తోంది. చెక్‌డ్యాం నిర్మాణంలో చోటు చేసుకున్న లోపాలకు బాధ్యులు ఎవరనే అంశంపై తీవ్రంగా చర్చ జరుగుతుంది. ఏర్గట్ల మండలం తొర్తి, ముప్కాల్ మండలం వెంచిర్యాల్ మధ్య పెద్ద వాగుపై రూ.4.80 కోట్లతో చెక్‌డ్యాంను నాలుగేళ్ల క్రితం నిర్మించారు. 2.5 మీటర్ల ఎత్తులో నిర్మించాల్సిన చెక్‌డ్యాంను 4 మీటర్ల ఎత్తుకు పెంచారు. చెక్‌డ్యాం ప్రారంభించిన సమయంలోనే తొర్తి, వెంచిర్యాల్, శెట్‌పల్లి రైతులు ఎత్తు విషయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎక్కువ ఎత్తులో చెక్‌డ్యాంను నిర్మిస్తే వాగులో ఎక్కువ నీరు నిలిచి పరిసరాల్లోని పంటలు నీట మునిగిపోతాయని రైతులు సందేహం వ్యక్తం చేశారు. ఎత్తు తగ్గిస్తే నిధులు తగ్గిపోతాయని ఆశించిన కొందరు నాయకులు ఎత్తు తగ్గించడానికి అంగీకరించలేదు. గడిచిన ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు చెక్‌డ్యాంపై నుంచి నీరు పొంగి పొర్లడంతో పాటు, పెద్దవాగుకు ఇరువైపులా మట్టితో నిర్మించిన కట్ట కొట్టుకుపోయి నీరు పంట పొలాల్లోకి చేరింది. దీంతో వాగు ప్రవాహానికి తొర్తి, వెంచిర్యాల్, శెట్‌పల్లి రైతులకు చెందిన సుమారు 150 ఎకరాల పంట నీట మునిగింది. పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో పంటల సాగుకు వాతావరణం అనుకూలంగా లేకపోయింది.

నీటిపాలైన ప్రజాధనం

చెక్‌డ్యాం ఎత్తుతోనే పంట పొలాల నీట మునకకు ప్రధాన కారణమని ప్రజాప్రతినిధులు గుర్తించారు. చెక్‌డ్యాం ఎత్తును కుదించేందుకు ఇరిగేషన్ శాఖ అనుమతి ఇచ్చే అవకాశం లేకపోవడంతో ఇటీవల అనధికారికంగానే కుదింపు పనులు చేపట్టి పూర్తి చేశారు. అనాలోచితంగా చెక్‌డ్యాం ఎత్తు పెంచడం, మళ్లీ కుదించడంతో ప్రజాధనం నీటి పాలైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా ఈ నష్టానికి బాధ్యులు ఎవరు ఎవరిపై చర్యలు తీసుకుంటారనే విషయంలో స్పష్టత లేకపోయింది. చెక్‌డ్యాం ఎత్తు కుదించడానికి అవసరమైన ఖర్చును రైతులు భరించాలని కొందరు ప్రజాప్రతినిధులు సూచించడం రైతులు దీనికి అంగీకరించకపోవడంతో ఘర్షణ వాతావరణానికి అవకాశం కల్పించింది. చెక్‌డ్యాం నిర్మాణంలో చోటు చేసుకున్న లోపాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దళితబంధు పథకంపై ఆగని నిరసన



తిర్మన్‌పల్లిలో నిరసన తెలుపుతున్న దళితులు



సిర్నాపల్లిలో..

ఇందల్వాయి: దళితబంధు పథకంపై మండలంలోని పలు గ్రామాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. పలు గ్రామాల్లోని 67 మంది దళితులు దళితబంధు పథకానికి ఎంపికయ్యారు. దీంతో అర్హుల జాబితా వెలువడిన నాటి నుంచే దళితులు ఆందోళనలు, నిరసనలు తెలుపుతున్నారు. అనర్హులను అర్హులుగా అధికార పార్టీ నాయకులు ఎంపిక చేశారంటూ పలు గ్రామాల్లో నిరసన వ్యక్తమవుతోంది. గురువారం నల్లవెల్లిలో మాదిగ కులస్తులు దళిత బంధు ఎంపికలో తమకు అన్యాయం జరిగిందంటూ బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనరాదని, డప్పులు కొట్టరాదని కట్టుబాటు చేసుకున్నారు. కులం కట్టుబాటు దాటిన వారికి రూ. ఐదువేల జరిమానా అంటూ తీర్మాణం చేశారు. శనివారం సిర్నాపల్లి, తిర్మన్‌పల్లి గ్రామాల్లో దళితులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట, పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. తిర్మన్‌పల్లిలో ఇద్దరు వీఆర్ఏ కుటుంబాలకు దళిత బంధు పథకం కేటాయించడాన్ని విమర్శించారు. ప్రకటించిన జాబితాను వెంటనే రద్దు చేసి గ్రామాల్లో సర్వే చేసి అర్హులకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గన్నారం, ఇందల్వాయి, పలు గ్రామాల్లో సైతం నిరసనల స్వరం వినిపిస్తోంది. గతంలో యంత్రలక్ష్మి పొందిన వారికి బీఆర్ఎస్ నాయకులు, అనుచరులను దళితబంధుకు ఎంపిక చేశారని దళితులతో పాటు ఇతర సామాజిక వర్గాలు చర్చించుకుంటున్నాయి. చాలా గ్రామాల్లో సర్వే చేయకుండా ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన వారి పేర్లనే దళిత బంధుకు సిఫార్సు చేశారని, దీంతో అసలైన వారికి అన్యాయం జరుగుతోందని అన్నారు. ఉన్నత అధికారులు స్పందించి అర్హులకు దళితబంధు పథకం వర్తించేలా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మొరాయిస్తున్న పీఎఫ్ఎంఎస్

- నిలిచిన ఆర్థిక సంఘం చెల్లింపులు
- సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యతో నెలరోజులుగా అంతరాయం



మోర్తాడ్(బాల్కొండ): స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులను కేటాయించినా పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(పీఎఫ్ఎంఎస్) మొరాయిస్తుండడంతో చెల్లింపులకు ఆటంకం కలుగుతోంది. గతంలో కేంద్రం ఆర్థిక సంఘం ద్వారా జీపీలు, మండల పరిషత్‌లకు ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారే కేటాయించేది. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందనే కారణంతో నేరుగా జీపీలు, మండల పరిషత్‌లకు నిధులు మంజూరి చేయడానికి 2022-23 ఆర్థిక సంవత్సరంలో పీఎఫ్ఎంఎస్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. జీపీలు, మండల పరిషత్‌లకు ప్రత్యేక బ్యాంక్ ఖాతాలను తెరిపించి చెక్‌పవర్ ఉన్న సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీపీ, ఎంపీడీవోలకు ప్రత్యేక టోకెన్లను జారీ చేశారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా నెల రోజుల కింద స్థానిక సంస్థలకు నిధులు విడుదలయ్యాయి. గతంలోనూ మంజూరైన నిధులు ఖాతాల్లో ఉన్నాయి. వీటితో చేపట్టిన పనులకు చెల్లింపులు చేయాల్సి ఉండగా నెల రోజుల నుంచి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఏర్గట్ల మండలంలోని అన్ని జీపీలకు సంబంధించిన పీఎఫ్ఎంఎస్ విధానం మొరాయిస్తోంది. మోర్తాడ్ మండల పరిషత్‌తో పాటు జిల్లాలోని కొన్ని జీపీల్లోనూ ఇదే సమస్య ఉత్పన్నమైంది. నెల రోజుల నుంచి చెల్లింపులు లేకపోవడంతో జీపీలు ట్రాక్టర్లకు సంబంధించిన కిస్తులను బ్యాంకులకు చెల్లించలేకపోతున్నాయి. నిధులు ఉన్నా వాటిని వినియోగించుకోవడానికి సాంకేతిక సమస్య అవరోధంగా మారడంతో సర్పంచులు, కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు కాకుండా సాధారణ పద్ధతిలో చెల్లింపులైతే ట్రెజరీల్లో ఫ్రీజింగ్‌తో ఎంతో ఇబ్బంది కలిగించేది. ఇప్పుడేమో సాంకేతిక సమస్య అడ్డంకిగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సమస్య లేకుండా చూస్తాం

ఆర్థిక సంఘం చెల్లింపులకు సంబంధించి సాంకేతిక సమస్యలు ఏర్పడితే కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సాంకేతిక నిపుణులతో మాట్లాడి సమస్య లేకుండా చూస్తున్నాం. ఓటీపీ సమస్య ఉండగా ఈ అంశాన్ని పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



కబడ్డీలో తలపడుతున్న బాలికలు



ఖో-ఖోలో తలపడుతున్న బాలురు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ జోన్ స్కూల్ గేమ్స్ కబడ్డీ, ఖో-ఖో అండర్-14, అండర్-17 బాల, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు ఎంఈవో రాజగంగారాం తెలిపారు. మండలంలోని మిట్టాపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఎంఈవో సర్పంచ్ గణేశ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. అక్టోబర్ 3న బాల్కొండలో నిర్వహించే 67వ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్‌లో రూరల్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం కబడ్డీ, ఖో-ఖో అండర్-14, అండర్-17 బాల, బాలికల విభాగంలో నిజామాబాద్ రూరల్ జట్టుకు 12 మంది క్రీడాకారుల చొప్పున ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు టి.విద్యాసాగర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, నరేశ్‌చంద్ర, ఉప సర్పంచ్, వీడీసీ సభ్యులు, పీఈటీలు మర్కంటి గంగామోహన్, ప్రసాద్, నల్లూరి లత, జ్యోత్స్న, సాయికుమార్, రంజిత్, శ్రీకాంత్, సాయిలు, లక్‌పతి, వినోద్, మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తిప్పలు



ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన జనం

సిరికొండ: రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారులు తిప్పలు పడుతున్నారు. రేషన్‌కార్డులో చిన్న పిల్లలు ఉన్న వారివి ఈ-కేవైసీ కోసం వేలిముద్రలు రాకపోవడంతో ఆధార్ అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరుతున్నారు. తహసీల్ కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రానికి లబ్ధిదారులు ఉదయం ఆరు గంటలకే చేరుకుంటున్నారు. ఈ-కేవైసీ చేయించుకోవడానికి డిసెంబర్ నెల చివరి వరకు గడువు ఉందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రకటించినా రేషన్‌కార్డుదారులు అవేమి పట్టనట్లు ఆధార్ కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే రేషన్ బియ్యం నిలిచిపోతాయని పుకార్లు రావడంతో రేషన్ కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తమ పిల్లల వేలిముద్రలను అప్‌డేట్ చేయించుకోవడానికి ఆధార్ కేంద్రానికి తరలివస్తున్నారు. ఒక్కరికి చెందిన ఆధార్ కార్డు అప్‌డేట్ చేయడానికి అరగంటకు పైగా సమయం పడుతుండడంతో ఒక్క రోజులో ఎక్కువగా చేయలేకపోతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు.

జిల్లా క్రీడాకారులపై ప్రభుత్వం చిన్నచూపు



ఖలీల్‌వాడి: జిల్లా మహిళా క్రీడాకారులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని మైనార్టీ నేత సయ్యద్ కై సర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భాగ్య అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్రీడల్లో జిల్లాకు ఎంతో పేరు తెచ్చిన యెండల సౌందర్య, నిఖత్ జరీనా, గుగులోత్ సౌమ్య, మాలవత్ పూర్ణకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు అందలేదని ఆరోపించారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్ష చేయడంతోనే మహిళా బిల్లు వచ్చిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహిళలకు ఎమ్మెల్యే అభ్యర్థి టిక్కెట్లు ఇప్పించాలని ఎమ్మెల్సీ కవితను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేల్పూర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వరూప పాల్గొన్నారు.

రేపు జిల్లాకు పురుషోత్తమ భారతి రాక



పురుషోత్తమ భారతి


నిజామాబాద్ సిటీ: నగరశివారులోని శ్రీ లక్ష్మీగణపతి మహా ఆలయానికి సోమవారం శృంగేరీ శివగంగా పీఠాధిపతులు పురుషోత్తమ భారతి రానున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అరుణ్‌కుమార్ శర్మ తెలిపారు. స్వామివారికి స్వాగత కార్యక్రమాలతో పాటు పాద పూజ, అనంతరం సంకష్ట హరచతుర్థి సామూహిక పూజా కార్యక్రమం ఉంటుందని అన్నారు. మంగళవారం ఉదయం లక్ష్మీగణపతి మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం



బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1977-78 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం సమ్మేళనం నిర్వహించారు. 46 ఏళ్ల తరువాత అందరూ ఒకే చోట చేరడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పూర్వ విద్యార్థుల్లో చరిత్ర పరిశోధకులుగా గుర్తింపు పొందిన కంకణాల రాజేశ్వర్, యాదవరావును సన్మానించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



రెంజల్(బోధన్): మహారాష్ట్ర నుంచి వస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి బోధన్‌కు సుమారు 300 క్వింటాళ్ల బియ్యాన్ని బోధన్‌కు తీసుకొస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు కందకుర్తి వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగిసిన అంత్యక్రియలు

నిజామాబాద్ రూరల్: భూవివాదంలో మృతి చెందిన మండలంలోని కేశాపూర్ గ్రామానికి చెందిన ఉమ్మాయి సత్యంరెడ్డి అంత్యక్రియలు పోలీసుల పికెట్ మధ్య శనివారం ముగిశాయి. ఈ నెల 19న సత్యంరెడ్డిపై బీరుసీసాతో చిన్నారెడ్డి, గంగాధర్ దాడి చేయడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జరగాల్సిన అంత్యక్రియలు శనివారం జరగడంతో పోలీసులు గ్రామంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు.

క్రైం కార్నర్

కరెంట్ టవర్ ఎక్కిన యువకుడు



టవర్‌పై కూర్చున్న షేక్ అఫ్రోజ్

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్‌లో భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు కరెంట్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌కు చెందిన షేక్ అఫ్రోజ్‌కు ఆర్యనగర్‌కు చెందిన యువతితో వివాహం జరిగింది. నాలుగు నెలల క్రితం తల్లిగారింటికి వచ్చిన అఫ్రోజ్ భార్య తిరిగి బోధన్‌కు వెళ్లలేదు. దీంతో మద్యం మత్తులో కరెంట్ టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. దీంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డి: దేవునిపల్లి శివారులో ఉన్న పోచారం కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేశ్ శనివారం తెలిపారు. పోచారం కాలువలో గుర్తుతెలియని మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతుడి జేబులో బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డికి ఈనెల 29న ఉదయం ప్రయాణించినట్లు ఉన్న బస్ టికెట్ ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మేకలను మింగిన పాము



సిరికొండ: హుస్సేన్‌నగర్ గ్రామంలో పెంజర పాము రెండు మేకలను మింగినట్లు గ్రామస్తులు తెలిపారు. పోచమ్మ ఆలయ సమీపంలో గ్రామానికి చెందిన గొల్ల నాగేశ్‌కు చెందిన కొట్టంలోకి పాము చొరబడి రెండు మేకలను మింగింది. గమనించిన నాగేష్ గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా పామును చంపేసినట్లు తెలిపారు.

చిరుత దాడిలో మేక మృతి

వర్ని: మండలంలోని కూనీపూర్ అటవీ ప్రాంతంలో చిరుత దాడిలో మేక మృతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. కొంత కాలంగా అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు రైతులు వెల్లడించారు. అడవిలోకి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

గణేశ్ విగ్రహాల నిమజ్జనంలో ఘర్షణ

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. డీజే పాటల విషయంలో గణేశ్ మండలి నిర్వాహకుల మధ్య మాటామాట పెరిగి దాడులకు పాల్పడ్డారు. పలువురికి గాయాలయ్యాయి. బాన్సువాడ పోలీసులు గ్రామానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టి బందోబస్తు నిర్వహించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు సంయమనం పాటించాలని సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు.

పసుపు పరిశ్రమతో ఆర్థిక అభివృద్ధి




పసుపు పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న మధుశేఖర్


వేల్పూర్: మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పసుపు, సుగంధ ద్రవ్యాల పరిశ్రమతో ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మధుశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని పడగల్ శివారులోని స్పైస్‌పార్కులో రూ. 39 లక్షలతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేసిన సుగంధద్రవ్యాల పరిశ్రమకు డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలు వ్యాపారం చేసి అభివృద్ధి చెందేందుకు పరిశ్రమ ఏర్పాటు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఆర్మూర్ డివిజన్‌లో ఎక్కువగా లభించే పసుపును నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తే తక్కువ ధరకు ముడిసరుకు లభిస్తుందని, రైతులు కూడా స్థానికంగా అమ్ముకునే సౌకర్యం ఏర్పడుతుందన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ భీమజమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, డీఆర్‌డీవో చందర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు రేగుల్లరాములు, సామ మహిపాల్, రాకేశ్‌చంద్ర, నాగధర్‌రెడ్డి, ద్యావతి రాజ్‌కుమార్, శ్యాంరావు, ఆమోస్, ఐకేపీ ఏపీఎంలు కుంట గంగారెడ్డి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న భూపతిరెడ్డి



ఆర్థికసాయం అందజేస్తున్న నాగేశ్‌రెడ్డి

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లిలో ప్రేమోన్మాది దాడిలో గాయపడి మృతి చెందిన బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియే చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలన్నారు. ఆయన వెంట కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బాధిత కుటుంబాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాట్‌పల్లి నాగేశ్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. పార్టీ నాయకుడు పోలసాని శ్రీనివాస్, డిచ్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు నర్సయ్య, జలం గాంధీ, సురేశ్, రఘుపతిరెడ్డి ఉన్నారు.

పాము కాటుతో బాలిక మృతి

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో పాము కాటుతో అనూజ (6) అనే బాలిక మృతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని విషపురుగు కుట్టడంతో అస్వస్థతకు గురైంది. గమనించిన తండ్రి స్వామి నవీపేట లోని ఆసుపత్రికి తరలించగా పాముకాటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నేడు అర్చకులకు శిక్షణ

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ధూపదీప నైవేద్యం అర్చకులకు నేటి నుంచి ఆలయాల్లో నిర్వహించే పూజలపై పునశ్చరణ శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు రాచప్పా, అంజనప్పా శనివారం తెలిపారు. మాధవనగర్ సాయిబాబా ఆలయంలో గ్రామ దేవత, వైదిక స్మార్తా అర్చలకు మాత్రమే శిక్షణ తరగతులు ఉదయం 10 నుంచి ఉంటాయని వారుమాత్రమే హాజరుకావాలని పేర్కొన్నారు.